
పాకాలలో త్వరలో
సఫారీ టూర్
● వన్యప్రాణుల మధ్య ప్రయాణం
● పర్యాటకులకు కనువిందు
ఐదు గుట్టల్లో
మన ఆనవాళ్లు
● ఆనాటి కొల్లాపూర్ నేటి కొలన్‌పల్లి
● చరిత్రకు మారుపేరుగా నిలుస్తున్న గ్రామం
5లో

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
మంగళవారం 7 అక్టోబరు 2025
3



ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రతి మండలంలోని తహసీల్దార్, పోలీసులు ఎంపీడీవో అధికారులు సమన్వయ ముగా పని చేయాలన్నారు. నామినేషన్ ప్రక్రియకి అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేయాలన్నారు. మాస్టర్ ట్రైనింగ్‌ల ద్వారా ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్క అధికారి మరోసారి ఎన్నికల నిర్వహణ పైన ఉన్న సందేహాలను నివృత్తి చేపించాలన్నారు. సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

సమాచార హక్కు చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 5 నుంచి 12 వరకు సమాచార హక్కు వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

రూ.24.44 లక్షల విలువైన గుట్కా పట్టివేత

రఘునాథపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి వరంగల్‌కు బొలెరో గూడ్స్ క్యారియర్ మ్యాక్స్ వాహనంలో గుట్టుగా తరలిస్తున్న రూ.24.44 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను (పొగాకు ఉత్పత్తులు) వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు రఘునాథపల్లి పోలీసులు సోమవారం జాయింట్ ఆపరేషన్ నిర్వహించి పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు గుట్కా ప్యాకెట్లను బొలెరో వాహనంలో తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న రఘునాథపల్లి కోమల్ల టోల్ ప్లాజా వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులతోపాటు రఘునాథపల్లి పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలో గుట్కా ప్యాకెట్లు లభ్యం కావడంతో వాటిని వాహనంలో తరలిస్తున్న వరంగల్ బట్టల బజార్‌కు చెందిన జాలం సింగ్, రాజ్ పురోహిత్ జబ్బర్ సింగ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకొని పంచనామా నిర్వహించి గుట్కా ప్యాకెట్లను స్వాధీనపరచుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దూదిమెట్ల నరేష్ తెలిపారు.

● వానాకాలం ధాన్యం సేకరణకు ప్రణాళిక
● జిల్లాలో 309 కేంద్రాల ఏర్పాటు యోచన
● సన్న దొడ్డు బియ్యానికి వేర్వేరు కేంద్రాలు
● 2.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
● 50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని అధికారుల అంచనా..
● రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

కొనుగోళ్లకు సన్నద్ధం!



జనగామ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధమైంది. వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వరి పంటలు అక్కడక్కడ కోత దశకు వస్తుండడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ధాన్యం సేకరణ, రవాణా, డబ్బుల చెల్లింపు తదితర అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో వరి పంట ఎంతమేర సాగయింది, ఎంత మేర దిగుబడి వస్తుంది, ఏమేర కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తుందన్న దానిపై అధికారులు ప్రణాళిక తయారు చేసుకున్నారు. కేంద్రాలకు వచ్చే ధాన్యానికి సరిపడా గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్లు, రవాణాకు కావాల్సిన లారీలు, కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ తదితర అంశాలపై అధికారులు కసరత్తు పూర్తి చేశారు.

జిల్లాలో 309 కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ఈ సారి 309 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఏడాది జిల్లాలో ఇదే సీజన్‌లో 181 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా ఈసారి 309 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాలను ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేయడం ద్వారా కొనుగోళ్లలో వేగాన్ని పెంచవచ్చని అధికారులు భావిస్తున్నారు. కాగా, గత సీజన్ మాదిరిగానే ఈ సీజన్‌లోనూ దొడ్డు, సన్నరకం ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో దొడ్డరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకేపీ పరిధిలో 116, పీఏసీఎస్ పరిధిలో 82కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకేపీ పరిధిలో 69, పీఏసీఎస్ పరిధిలో 42 కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మొత్తంగా దొడ్డరకం కేంద్రాలు 198 కేంద్రాలు, సన్నరకం 111 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

2.05 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా

జిల్లావ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 2,13,978 ఎకరాల్లో వరి పంట సాగయింది. కాగా.. జిల్లాలో 5,43,057 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు సన్నరకాన్ని ఎక్కువగా సాగు చేస్తుంటారు. దీంతో ఇంటి అవసరాలకు సన్నరకం ధాన్యాన్ని రైతులు ఉంచుకోగా, మిగిలిన సన్న, దొడ్డరకం ధాన్యాన్ని కేంద్రాలకు తెస్తారు. దీనితో పాటు తేమ శాతం అధికంగా ఉన్న రైతులు మిల్లర్లకు, ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటారు. ఇవన్నీ పోగా కొనుగోలు కేంద్రాలకు 2,05,057 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. కాగా.. ఈ ధాన్యానికి సుమారు 50 లక్షల గన్నీ బ్యాగులు అవసరం అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకు..

వరి ధాన్యం కొనుగోళ్లలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులు భావిస్తున్నారు. గతంతో ధాన్యం కొనుగోళ్లలో సందర్భంగా గన్నీల కొరత, రవాణాలో ఆలస్యం, వర్షంతో ధాన్యం తడవడం, డబ్బుల చెల్లింపుల్లో జాప్యం వంటి ఘటనలు తరచుగా ఎదురయ్యేవి. దీంతో గత ఏడాది వానాకాలం సీజన్ నుంచి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. మండల స్థాయి అధికారులతోపాటు, మండల ప్రత్యేకాధికారులకు ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ప్రతి అధికారి రోజూ కొనుగోలు కేంద్రాలను సందర్శించేలా చూశారు. దీనితోపాటు కలెక్టర్ సైతం ప్రతి రోజూ ఒకటి, రెండు కేంద్రాలను సందర్శించి కొనుగోలుకు సంబంధించిన సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో గత సీజన్‌లో జిల్లాలో కొనుగోళ్లు సాఫీగా జరిగాయి. కాగా, ఈ సీజన్‌లోనూ అదే తరహా విధానాన్ని అవలంబించాలని భావిస్తున్నారు. ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలు, మరో వైపు కొనుగోళ్ల సీజన్ కావడంతో అధికారులకు సవాల్‌గా మారనుంది. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులు భావిస్తున్నారు.

కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగొద్దు : కలెక్టర్



జనగామ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి సివిల్ సప్లై, మార్కెటింగ్, ఐకేపీ, సహకార, వ్యవసాయ శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలన్నారు. ఏ రోజు వచ్చిన ధాన్యాన్ని అదే రోజు కొనుగోలు చేసేలా చూడాలని, రైతులు వేచి చూసే పరిస్థితి ఉండొద్దన్నారు. ప్రతి కేంద్రానికి ఎంత ధాన్యం వచ్చింది, ఎంత రవాణా అయింది, ఎంత మంది డబ్బులు జమయ్యాయనే వివరాలను రిజిస్టరులో తప్పక నమోదు చేయాలన్నారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించి, నాణ్యమైన ధాన్యాన్నే కేంద్రాలను తెచ్చేలా చూడాలన్నారు. వర్షాల నేపథ్యంలో కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ఆటంకాలు లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరి చేసిన రూ 50కోట్ల నిధులతో చేబట్టే పనులను ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సూచించారు. సోమవారం మునిసిపాలిటీ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, మునిసిపాలిటీ అధికారులతో అభివృద్ధి పనుల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాల ముందస్తు చర్యలు తీసుకొని పనులను వేగిరంగా పూర్తి చేసేలా కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. వరదనీరును పంపించే మార్గాలను గుర్తించాలని, జంక్షన్‌ల విస్తరణలో భాగంగా సమస్యలు రాకుండా పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జీవోలు వచ్చిన విధంగా పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాధాకృష్ణ, అధికారులు స్వరూపరాణి, వంశీకృష్ణ, యాసర్, ఎస్సై వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన..

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైతే చేబట్టే విధుల ఏర్పాట్లను, ఆర్వోల శిక్షణ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కడియంను రాజకీయ సమాధి చేయడం ఖాయం

-మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



గబ్బెటలో కాంగ్రెస్ బాకీ కార్డు పోస్టర్లతో రాజయ్య

రఘునాథపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీలో చేరి నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని, త్వరలోనే ఆయనను రాజకీయ సమాధి చేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఊరూరికి బీఆర్ఎస్ అభివృద్ధి-ఇంటింటికి కేసీఆర్ సంక్షేమ పథకాలు' కార్యక్రమంలో భాగంగా సోమవారం పడమటిగూడెం, నిడిగొండ, ఎల్లారెడ్డిగూడెం, శ్రీమన్నారాయణపురం, బాంజీపేట, కన్నాయిపల్లి, కోడూరు, రామన్నగూడెం, గబ్బెట, తదితర గ్రామాల్లో పర్యటించారు. గబ్బెటలో కాంగ్రెస్ బాకీ పోస్టర్లను విడుదల చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హామీల అమలులో సర్కారు పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీ పథకాలు అటకెక్కయని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావును విమర్శించే నైతికత కడియం శ్రీహరికి లేదన్నారు. శివాజీనగర్ మాజీ సర్పంచ్ శివరాత్రి కొమురయ్య కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వై.కుమార్ గౌడ్, నాయకులు కావటి రాజయ్య, గూడ కిరణ్ కుమార్, ఎండి.రంజాన్, మడ్లపల్లి సునీత, రాజు, మల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి: ఎమ్మెల్యే

దేవరుప్పుల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాశవాడకు చెందిన 30 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సందర్భంగా మాట్లాడుతూ రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలలో కాంగ్రెస్ పూర్తి మెజార్టీతో గెలువాలని సూచించారు.

● చిన్నమడూర్, మన్‌ప్పహడ్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పార్టీ బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు.



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

పత్తి విక్రయాలపై నేడు వీడియో కాన్ఫరెన్స్

జఫర్‌గడ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులకు నేడు మంగళవారం జఫర్‌గడ్‌లోని రైతు భవనంలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని వ్యవసాయ విస్తరణాధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పత్తిని సాగు చేసే రైతులు తమ పత్తిని సీసీఐలో విక్రయించుకునేందుకు విధిగా కిసాన్ కాపస్ అనే యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానం, పత్తి విక్రయాలు, ఉత్పత్తి వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. రైతు భవనంలో మంగళవారం జరిగే సమావేశానికి పత్తి రైతులు హాజరు కావాలని కోరారు.

రేషన్ డీలర్లు

● ఆరు నెలలుగా అందని కమీషన్
● ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.12.5 కోట్లు పెండింగ్
● ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి లక్షకు పైగా బకాయి
● రాష్ట్రం కరుణించినా.. కనికరించని కేంద్రం
● షాపుల బంద్‌కు సిద్ధమవుతున్న డీలర్లు



రేషన్ షాపులో బియ్యం పంపిణీ (ఫైల్)



సీఎంను కలిసిన బత్తుల రమేశ్‌బాబు

హనుమకొండ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వ కమీషన్ వాటా డీలర్లకు ఇంకా విడుదల కాలేదు. బకాయిలు ఎప్పుడెప్పుడు అందుతాయా.. అని డీలర్లు ఎదురు చూస్తున్నారు. దసరా పండుగ క్రమంలో కేంద్రం కరుణిస్తుందని ఆశించగా డీలర్లకు నిరాశే మిగిలింది. ఈ మాసం తొలి వారం ముగుస్తున్నా ఇంకా కమీషన్ విషయంలో కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా డీలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలను కేంద్రం పట్టించుకోవడం లేదనే ఆగ్రహానికి డీలర్లు గురవుతున్నారు. ఇక ఉపేక్షించేది లేదని, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా షాపుల నిరవధిక బంద్ పాటించాలనే నిర్ణయానికి వస్తున్నారు. రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. రెండు ప్రభుత్వాల వాటా కమీషన్ రూపంలో డీలర్లకు చేరుతుంది. కిలో బియ్యం పంపిణీకి రూ.1.40 పైసల కమీషన్ చొప్పున డీలర్‌కు చెల్లింపు ఉంటుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.0.50 చెల్లిస్తుంది. కేంద్రం రూ.0.90 పైసలను భరిస్తూ ఈ మేరకు డీలర్ ఎన్ని కిలోలు పంపిణీ చేస్తే ఆ లెక్కన కమీషన్ డబ్బులు అందుకుంటాడు. ఈ లెక్కన ప్రతీ నెల డీలర్‌కు కమీషన్ డబ్బులు అందాల్సి ఉంటుంది. ఈ విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. డీలర్లు రోడ్డెక్కి నిరసనలు, ధర్నాలు చేయడంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతులోని ఐదు నెలల కమీషన్ బకాయిలను విడుదల చేసింది. కానీ, కేంద్రం ఇప్పటికీ స్పందించకపోవడమే డీలర్లకు ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

రూ.12.5 కోట్లకు పైగా బకాయిలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,200 రేషన్ షాపులు ఉన్నాయి. షాపులకు సంబంధించిన డీలర్లకు కేంద్ర ప్రభుత్వ కమీషన్ వాటా డబ్బులు రూ.12.5 కోట్లకు పైగా విడుదల కావాల్సి ఉంది. ఒక్కో డీలర్‌కు రూ.50వేల నుంచి లక్షకు పైగా డబ్బులు రావాల్సి ఉంది. దసరా పండుగ ఖర్చులకు అయినా డబ్బులు చేతిలో పడుతాయనే ఆశతో డీలర్లు ఉండగా కేంద్రం కిమ్మన లేదు. అక్టోబరు నెల కూడా రావడంతో ఆరు నెలల కమీషన్ బకాయిలు అందక డీలర్లు అప్పుల పాలవుతున్నారు. షాపుల అద్దెలు కూడా చెల్లించని దుస్థితిలో ఉన్నామంటూ వాపోతున్నారు.

ముఖ్యమంత్రికి విజ్ఞప్తి..

ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు, తదితర ప్రతినిధులు హైదరాబాద్‌లో కలిశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి (మిగతా 6వ పేజీలో)

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

నర్సింహులపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దానాలను ఇచ్చి ప్రజలను నిండా ముంచిందన్నారు. డోర్నకల్ నియోజిక వర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులు నేడు స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలుపిస్తాయని చెప్పారు. డోర్నకల్ ప్రజలు హంసలాంటి వారని అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకుంటారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు షైదం దేవేందర్, మిరియాల వెంకన్న, కొండబత్తిని జగదీశ్వర్, కొత్త రవీందర్‌రెడ్డి, నెలకుర్తి నర్సింహారెడ్డి, కుంభం సువీర్‌రెడ్డి, ఎల్లు మధుసూదన్‌రెడ్డి, ఖాజామీయా, రవి, సురేష్, వీరన్న పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

● డీఎంహెచ్‌వో రవిరాథోడ్



అన్నప్రసాద వితరణ చేస్తున్న డీఎంహెచ్‌వో రవి రాథోడ్

తొర్రూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్ అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు దారం కుమారస్వామి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులకు, బాలింతలకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ జూట్ బ్యాగుల పంపిణీ, మొక్కలు నాటడం, వ్యాధులపై అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రవి రాథోడ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజలను ఆదుకోవడం అభినందనీయమని అన్నారు. సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాంనర్సయ్య, క్లబ్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర రావు, రవీందర్ రెడ్డి, కిరణ్ కుమార్, నందనాదేవి, మీరజ్, ప్రియాంక తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

● పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

పెద్దవంగర, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నిక ల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బొమ్మరబోయిన ప్రదీప్, భూక్య కృష్ణ, రాగుర్, రవితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దు కుందామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రిజర్వేషన్ అమలు చేయాలి

● ఆదివాసీ ప్రజా సంఘాల డిమాండ్



కొత్తగూడలో మాట్లాడుతున్న నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం గుర్తించిన 5వ షెడ్యూల్‌లోని హక్కులు, చట్టాలను పరిగణలోకి తీసుకుని ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీలు రాజకీయాల్లో ఎదగకుండా చేసే కుట్రలో భాగంగానే ఏజెన్సీ ప్రాంతంలో జనరల్ రిజర్వేషన్లు కేటాయించారని ఆరోపించారు. దీని వలన షెడ్యూల్డ్ ప్రాంతంలోని చట్టాల ఉల్లంఘన జరుగుతుందని, గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. సమావేశంలో ధనసరి రాజేష్, మోకాళ్ల సుధీర్, పూనెం సందీప్ దొర, ఆగబోయిన ప్రశాంత్, ఈసం కాంతారావు పాల్గొన్నారు.

జింక మాంసం స్వాధీనం



పట్టుబడిన భద్రయ్య

మహాముత్తారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వండిన జింక మాంసాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పెదపల్లి రేంజర్ వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంగోత్ భద్రయ్య ప్రతి రోజూ తన మేకల మందతో అడవిలోకి వెళ్తుంటాడు. ఈ క్రమంలో అతడు తన ఇంటి వద్ద జింక మాంసం వండుకుంటున్నాడనే సమాచారం రావడంతో ఫారెస్టు అధికారులు దాడులు నిర్వహించారు. అతడి ఇంటి నుంచి కేజీ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మాంసం ఎక్కడిదని అడగ్గా మేకలు మేపడానికి తాను వెళ్లగా అడవిలో చనిపోయి ఉన్న జింక కనిపించిందని, ఆ కళేబరం నుంచి కొంత మాంసాన్ని తెచ్చుకొని వండుకుంటున్నానని చెప్పాడు. దీంతో భద్రయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు రేంజర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో అస్లం ఖాన్, ఎఫ్‌బీవో అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.



వండిన జింక మాంసం

కాంటింజెన్సీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కొత్తగూడలో వర్కర్లకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంటింజెన్సీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, కొత్తగూడ గ్రామ మాజీ సర్పంచ్ భూపతి తిరుపతి డిమాండ్ చేశారు. కాంటింజెన్సీ వర్కర్లు కొత్తగూడలో చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం సంఘీభావం పలికారు. వర్కర్లకు మద్దతుగా సమ్మెలో బైఠాయించారు. కార్యక్రమంలో నాయకులు భూర్క మల్లయ్య, సోలం శ్రావణ్, జిమ్మిడి శ్రీనివాస్, బంగారి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గ్రేహౌండ్స్ ఆర్ఎస్ఐ మృతి

● నివాళులర్పించిన గ్రేహౌండ్స్ డీఐజీ కల్మాల్, ఎమ్మెల్యే కడియం

● పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్‌కు చెందిన గ్రేహౌండ్స్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గంగుల అచ్యుతరెడ్డి (54) శనివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఆయన స్వగ్రామం రాఘవాపూర్‌లో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. గ్రేహౌండ్స్ డీఐజీ కల్మాల్ మృతుడి ఇంటిని చేరుకుని నివాళులర్పించారు. గ్రేహౌండ్స్ ఎస్పీ సత్య శ్రీనివాస్, డీఎస్పీలు పేగ్, సాగర్, ఆర్ఐలు దాసు, శంకర్‌తోపాటు రిటైర్డ్ ఉద్యోగులు, ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నివాళులర్పించారు. అంతిమయాత్రకు ముందు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.



అచ్యుత రెడ్డి (ఫైల్)

1990లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన అచ్యుత రెడ్డి 1994 వరకు నిజామాబాద్ డిచ్‌పల్లిలో విధులు నిర్వహించారు. 1994లో మామునూర్ బెటాలియన్‌కు చేరుకొని అక్కడ కొంతకాలం పనిచేసి గ్రేహౌండ్స్ విభాగంలో చేరి ప్రతిభ కనబరిచి అంచెలంచెలుగా ఆర్ఎస్‌గా ఎదిగారు. శనివారం గ్రేహౌండ్స్ ఆర్ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తుండగా క్యాంపులోనే గుండెపోటుకు గురి కాగా అక్కడి సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పలుమార్లు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, కుమారుడు, కూతురు ఉన్నారు.



అచ్యుత రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అచ్యుత రెడ్డి అకాల మరణం తీరనిలోటని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాఘవాపూర్ మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, నాయకులు నాగరబోయిన యాదగిరి, బత్తిని దశరథంగౌడ్, కాసాని బొందయ్య, కందుల గట్టయ్య, మహేష్ రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు రాజ్‌కుమార్



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు ఆగపాటి రాజ్‌కుమార్ అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. తమిళనాడులోని మధురై కామరాజ్ యూనివర్సిటీలో విశ్వర్షి వాసిలి వాఙ్మయం-దృక్పథాల ఆవిష్కరణ అనే అంశంపై ఈ నెల 9, 10, 11 తేదీలలో జరగనున్న అంతర్జాతీయ సదస్సులో 'వసంతగానం చేద్దామంటున్న వాసిలి కవిత్వం- ఒక పరిశీలన' అనే అంశంపై ఆగపాటి రాజ్‌కుమార్ పత్ర సమర్పణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ అందాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు, మాదిగ నేతలు

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు దళితుల్లోని అన్ని వర్గాలకు అందాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సూచించారు. సోమవారం కేయూ గణితశాస్త్ర విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా , కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.సుజాతల నేతృత్వంలో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఘన సన్మానం చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ విద్య, ఉద్యోగాలతో పాటు అన్ని విభాగాల్లో అమలు జరిగేలా చూడాలన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలుస్తామన్నారు. 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాటంలో అనేక అవాంతరాలను ఎదుర్కొన్నామని చెప్పారు. ఉద్యోగాల్లో, ప్రమోషన్లలలో ఎస్సీ వర్గీరణ జరుపాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉద్యోగులు జాతి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పీడిత వర్గాలవిముక్తికి పోరాటాలు చేస్తామన్నారు. భారీ గజామాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్, హాస్టల్స్ డైరెక్టర్ఎల్‌పీ రాజ్‌కుమార్, బీసీ నేత డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, డాక్టర్ సంకినేని వెంకన్న, డాక్టర్ మంద వీరాస్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దనయ్య, దిలీప్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ సిలివేరు రాజ్‌కుమార్, కుమ్మరి రాజయ్య, మంద రాజు, మంద శ్యామ్, బొక్క మొగిలి, బొచ్చు తిరుపతి, కుమ్మరి శ్రీనాథ్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, సూపరింటెండెంట్ బొల్లేపాక ప్రభాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ వంగాల సుధాకర్, వడ్డెపల్లి మోహన్,డాక్టర్ పుల్లా కుమార్, డాక్టర్ కుమారస్వామి, బొక్క దయాకర్, ప్రవీణ్ కుమార్ తోపాటు విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గణేష్ ఎంబీబీఎస్ చదువు బాధ్యత కేటీఆర్‌దే

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



గణేష్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన నిరుపేద విద్యార్థి తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక స్తోమత లేక ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఆర్మూళ్ల గణేష్ ఎంబీబీఎస్ చదువు బాధ్యత మాజీ మంత్రి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీసుకుంటారని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్ విద్యార్థికి అండగా ఉంటామని ట్విట్టర్‌లో స్పందించడంతో దాస్యం వినయ్ భాస్కర్ ఆ విద్యార్థికి రూ. లక్షా 50వేలు నగదు విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాలను ఆదుకున్నారని పేర్కొన్నారు. వేలాది మంది పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా అందించినట్లు తెలిపారు. ఆర్మూళ్ల గణేష్ చదువు పూర్తి బాధ్యత కేటీఆర్ తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాసు , బొల్లెపాక రాజేష్, పాస్టర్ స్వామిదాసు గణేష్ ఆర్థిక పరిస్థితిపై కేటీఆర్‌కు ఆర్థిక సహాయం కోసం ట్విట్టర్‌లో పెట్టడంపై వినయ్ భాస్కర్ వారికి అభినందనలు తెలిపారు

ఉత్తమ పోలీస్‌స్టేషన్లలో ఐనవోలుకు రెండో స్థానం ?

● ఆలిండియాలో 70వ స్థానం



ఐనవోలు పోలీస్‌స్టేషన్ భవనం

ఐనవోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపిక కావడానికి అడుగుదూరంలో నిలిచింది. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపిక చేయడం తెలిసిందే. దేశవ్యాప్తంగా 16,800 పోలీస్‌స్టేషన్లు ఉండగా అందులో ఈ యేడు (2025) ఐనవోలు పోలీస్‌స్టేషన్ ఆలిండియా వ్యాప్తంగా 70వ స్థానం, రాష్ట్రంలో 2 స్థానంలో ఆన్‌లైన్ ఫెర్ఫార్మెన్స్ కార్యక్రమంలో ఎంపికైంది. ఒక ఆన్‌లైన్ కార్యక్రమాలే కాకుండా వివిధ విభాగాల్లో సేవలు, విధులను హోమ్ మినిస్టరి విభాగ బృందం క్షేత్రస్థాయిలో పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి ర్యాంకును నిర్ణయిస్తారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్‌కు దేశంలోనే ఉత్తమ ర్యాంక్ సాధించేలా కృషి చేస్తున్నారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం లేదు. దేవస్థానం సత్రాలలో కొనసాగుతుంది. హోమ్ మినిస్టరి బృందం పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారుల దరఖాస్తులు సన్నిహిత కౌంటర్ ద్వారా స్వీకరణ, వాటి పరిశీలన బాధితులకు లభించిన న్యాయం, కేసుల నమోదు వివరాలు, శిక్షలు, పోలీసుల విధి నిర్వహణ, చెడు రుగ్మతలపై ప్రజలను చైతన్యపరిచిన కార్యక్రమాలు, ఫ్రెండ్లీ పోలీస్ విధానం తదితర విషయాలను పరిశీలించి అన్ని అంశాలలో పారదర్శకంగా ఉంటే రాష్ట్రంలో మొదటిది దేశంలో ఉత్తమ ర్యాంక్ పొందాలన్న లక్ష్యంగా ఎస్సై పస్తం శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రేపు జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో (రేపు) బుధవారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్ -17 క్రీడా పోటీల కార్యదర్శి ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 17 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2009 తర్వాత జన్మించిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో నిర్వహించే బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్ -17 బాల బాలికల చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఆసక్తి , అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం , పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకొని ఈ నెల 8న హనుమకొండ డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని ప్రశాంత్ ఆ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకై 9866450592లో సంప్రదించాలని ప్రశాంత్ సూచించారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

మండల కార్యదర్శి అలవాల సత్యవతి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి అలవాల సత్యవతి

గార్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు. సోమవారం గార్లలోని స్థానిక పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేదల సమస్యలే ఎజెండాగా సమరశీల పోరాటాలు చేస్తున్న సీపీఎం పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతాన్ని అడ్డం పెట్టుకొని ప్రజలను రెచ్చగొట్టే పార్టీని ఓటర్లు తిరస్కరించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, గోవిందు, వెకటేశ్వర్లు, మౌనిక, వీరభద్రం, రామయ్య, లోకేశ్వరరావు, అంబటి వీరస్వామి పాల్గొన్నారు.

రామప్పలో రేపటి నుంచి హెరిటేజ్ క్యాంపు

వెంకటాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో ఈనెల 8 నుంచి వరల్డ్ హెరిటేజ్ క్యాంపును నిర్వహించనున్నారు. ఈనెల 8 నుంచి 17 వరకు ఇవి కొనసాగుతాయని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు వ్యవస్థాపకులు ప్రొఫెసర్ పాండురంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం కోసం జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 30వరకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 180మంది భారతీయులు, 28 మంది విదేశీయులు ఆసక్తిని కనబర్చారని ఆయన పేర్కొన్నారు. ట్రస్టు నుంచి 30 మంది భారతీయులను, 10మంది విదేశీయులను ఎంపిక చేశామని వివరించారు. 30 మంది భారతీయులతోపాటు ఇరాన్ దేశానికి చెందిన ముగ్గురు వలంటీర్లు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ దివాకర హాజరుకానున్నారని వెల్లడించారు.

మేడిగడ్డకు 2.12లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


మహదేవపూర్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 2.12లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 3.40 మీటర్లు నమోదైంది.

ఐదు గుట్టల్లో మన ఆనవాళ్లు

ఆనాటి కొల్లాపూర్ నేటి కొలన్‌పల్లి



వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలన్‌పెల్లి గ్రామంలో ఉన్న బురుజు



దేవుడి గుట్టపై ఉన్న రామాలయం

- చరిత్రకు మారుపేరుగా నిలుస్తున్న గ్రామం
- పాలకుల నిర్లక్ష్యంతో తెలియకుండా పోతున్న చరిత్ర
- గుప్త నిధుల కోసం దుండగుల తవ్వకాలు
- పట్టించుకోని ప్రభుత్వం, పురావస్తు శాఖ అధికారులు

రాయపర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అందమైన, అతి సుందరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఎటు చూసిన పచ్చని పంట పొలాలతో ఉండే గ్రామంలో గ్రామానికి ఎంతో విశిష్టతను తెచ్చే గుట్టలు ఇక్కడి ప్రాధాన్యత. వరుసగా ఒక్కో గుట్ట ఒక్కో ప్రాధాన్యంగా చెప్పుకుంటూ గ్రామానికి అభిముఖంగా ఉండే ఈ గుట్టల్లో ఏదో తెలియని వింతలతో పాటు ప్రజలకు చెప్పుకునే నిజాలు, జరిగిన సన్నివేశాలు, మాట్లాడుకునే పూర్వ కాలం నాటి విషయాలు దాగున్నాయి. ఆనాటి ఇంత వైభవం కలిగిన గుట్టలను గుర్తు తెలియని వ్యక్తులు దోచేస్తున్నారు. ఎంతో భక్తితో నిర్మించిన కట్టడాలను కాల గర్భంలో కలిపేస్తున్నారు. దేవుడి విగ్రహాలను ధ్వంసం చేయడమే కాకుండా ధ్వజ స్తంభాలను సైతం పగులగొట్టి ముక్కలు చేస్తున్నారు. పడిపోయిన శిథిలాలు, శాసనాలు, చెల్లాచెదురుగా పడి ఉన్న కట్టడాలు వాటి చరిత్రను రూపుమాపి దర్శనమిస్తున్నాయి. అదే వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలన్‌పెల్లి ఒకప్పటి కొల్లాపూర్ పట్నం.

ఢిల్లీ సుల్తాన్, కాకతీయుల ఆనవాళ్లు...

ఢిల్లీ సుల్తాన్‌లు దేశాన్ని పరిపాలించిన కాలంలోనే ఈ గ్రామానికి రాజధానిగా హైదరాబాద్ దుందిగల్, తాలుకాగా రాయగిరి, పోలీస్‌స్టేషన్‌గా పెద్దపెండ్యాల ఉండేవని చరిత్రకారులతో పాటు ఇక్కడి వృద్ధులు చెపుతున్నారు. దఫేదారులు, జమానాలు గ్రామంలో పెద్ద బురుజును ఏర్పాటు చేసుకుని తమ పాలనను కొనసాగిస్తూ ప్రజల వద్ద శిస్తు వసూలు చేసేవారు. కాకతీయుల కట్టడాలు ఎక్కడా చెక్కు చెదరకుండా ఉన్నట్లే ఈ కొలన్‌పెల్లి గ్రామంలో కూడా అటువంటి రాతి కట్టడాలు కనిపిస్తాయి.

గుట్టల విశేషాలు ఇవే...

ఈ గ్రామానికి అందమైన ఐదు గుట్టలు ఊరికి అభిముఖంగా ఉన్నాయి. వీటి పేర్లు దేవుని గుట్ట, బైరేను గుట్ట, నూనేను గుట్ట, పెద్ద గుట్ట, ఎర్రబోడు గుట్ట. ఒక్కో గుట్టపై ఒక్కో దేవుడిని పూర్వ కాలంలో ఆరాధించేవారని, అందుకు నిదర్శనంగా ఆలయాలు సైతం ప్రస్తుతం కనిపిస్తున్నాయి. చెన్నకేశవ స్వామి దేవాలయం, లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, శివాలయం, నాగులమ్మ గుడి, సీతమ్మ వారి పొల్లుగుంట, ఆంజనేయస్వామి ఆలయం, యాదవ, కురుమలు ఆదరించే బస్మదేవుడు, బయ్యాల దేవుడు ఈ గుట్టల్లో కొలువై ఉన్నారు. ఇక్కడ రాములవారి పాదాలు, గై(గుహ)గా పిలువ బడే మునీశ్వరుల గుట్ట అందరినీ ఆకర్షించేలా కనిపిస్తాయి. దేవుడి గుట్ట వద్ద ఎదురుగా ఉండే కొలను ఎల్లప్పుడు నిండి ఉండేదని ఎంతో పవిత్రంగా ఉండేదని ఈ కొలను ఆధారంగా గ్రామానికి కొలన్‌పెల్లి అని పేరు పెట్టినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

మునీశ్వరుడి గుట్టకు విశిష్టత...

గతంలో దేవుడి గుట్టపై పూజలు నిర్వహించే వారని, గ్రామానికి చెందిన వాసం లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తదితరులు చిడతలను కొడుతూ పాటలు పాడుతూ గుట్టపై నిద్రించే వాడని అంటున్నారు. కొన్ని రోజులకు మునీశ్వరుడి అవతారంలో గడ్డాన్ని పెంచుకుని గ్రామస్థులకు కనబడకుండా బైరేను గుట్టలో ఉన్న సొరంగ మార్గంలోకి వెళ్లి రోజుల తరబడి తపస్సు చేసేవాడని చెబుతున్నారు. అందుకు ఈ గుట్టలకు మునీశ్వరుడి గుట్టగా పేరు వచ్చిందని, సొరంగ మార్గం ద్వారా వెళ్లే లోపలపెద్ద గుహలాగా ఉంటుందనిదానిలోకి వెళ్లే ధైర్యంలేక దానిని మూసి వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. దేవుడి గుట్టకు దిగువ భాగాన ఉండే శివాలయం, నాగులమ్మ విగ్రహాలు, కొలనుకుఆనుకునిఉన్న సీతమ్మ పొల్లు గుంటకు ఎంతో విశిష్టత ఉందని గ్రామస్థులు తెలిపారు.

భద్రాద్రికి వెళ్తుండగా...

పూర్వకాలంలో సీతారాములు భద్రాద్రికి వెళ్తుండగా కొలన్‌పెల్లి గ్రామం అటవీ ప్రాంతం కావడంతో దేవుడి గుట్ట వద్ద విడిది చేశారని అప్పుడు ఈ కొలను వద్ద రాముడు పాదాలు మోపారని గ్రామస్థులు చెపుతున్నారు. అలాగే సీతమ్మ వారు లవకుశులను జన్మనిచ్చినప్పుడు లవకుశుల బొడ్డును సైతం తొలగించి కోనేట్లో వేయడంతో దీనిని గొల్లుకుంట అంటారని చెప్పారు. పొల్లు కుంట వద్ద సీతాదేవి పరమ శివుడిని స్మరిస్తూ ఉన్న ఆకారంలో ఉండే లింగం కూడా ఉంది. సీతారాముల వారిని కూడా ఇక్కడే పరమశివుడు, మహావిష్ణువును స్మరిస్తూ కాశీకావడిని ఏర్పాటు చేసి వారిని భుజాలపై మోశాడని దానికి సంబంధించిన గుర్తులు సైతం కనిపిస్తాయని గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా ప్రతి శనివారం గుట్టపైకి వెళ్లే వారికి పెద్ద నాగ సర్పం కనిపిస్తుందని పూర్వీకులు చెపుతున్నారు. స్వామి వారు కలలోకి వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించండని, విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలని తెలిపినట్లు, గ్రామంలో శుభాలు జరుగుతాయని చెప్పడంతో కొన్ని రోజుల పాటు ప్రతి శనివారం దేవుడి గుట్ట పూజలు నిర్వహించేవారని చెపుతున్నారు.

దేవుడి గుట్టకు ఎదురుగా కొలనులో ఆలయానికి సంబంధించిన విగ్రహాలు,శిథిలాలు, వివిధ రాతి కట్టడాలు ఉన్నాయని గ్రామంలోని వేద పండితుడు చెబుతున్నారు.కొలనులో ఉపాధి హామీ పథకం కింద కూలీలతో తవ్వకాలు చేపట్టగా శివలింగం, నాగ స్వరూపాలు బయట పడ్డాయని అన్నారు. గడ్డపార లోపలికి సులభంగా వెళ్తుందని, నీరు ఊటలా పైకి వచ్చాయని తెలిపారు. తమ చిన్ననాటి కాలంలో చుట్టూ పక్కల గ్రామాల నుంచి చాలా మంది ప్రజలు మొక్కులు తీర్చుకోవడానికి జాతరలా బండ్లు కట్టుకుని వచ్చిపూజలు చేసే వారని వృద్ధులు తెలిపారు.

కాకతీయుల కట్టడం శిథిలావస్థకు చేరడంతో అందులో ఉన్న ఆలయంలో కొందరు దుండగులు తవ్వకాలు జరిపి దేవతామూర్తులను తొలగించి గుప్తనిధులు కాజేసినట్లు గ్రామస్థులు బావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్వ వైభవం తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.





గుట్టకు దిగువగా ఉన్న శివాలయం, పక్కన నాగులమ్మ విగ్రహాలు | మునీశ్వరుల గుట్టలోకి వెళ్లి సొరంగ మార్గం

పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి



గుట్టలపై ఉన్న దేవాలయాలను కాపాడాలి. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలి. ప్రజాప్రతినిధులు అధికారులు దీన్ని పర్యవేక్షించి తగు చర్యలు చేపట్టాలి. గ్రామంలో ఉన్న దేవాలయాల విశిష్టతను అందరికి చాటి చెప్పేలా చర్యలు తీసుకోవాలి.

\- జక్కుల నర్సయ్య, కొలన్‌పెల్లి

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి




పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గ్రామంలో ఉన్న ఐదు గుట్టలపై అధ్యయనం చేసేలా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలి. కాకతీయుల కట్టడాల్లో శిథిలావస్థకు చేరిన విగ్రహాలతో పాటు కొలనులో ఉన్న విగ్రహాలను శాసనాలను వెలికి తీసి పూర్వ వైభవం తీసుకురావాలి. పురావస్తు శాఖ అధికారులు సర్వే చేసి చారిత్రక సంపదను కాపాడాలి.

\- కృష్ణమాచార్యులు, కొలన్‌పెల్లి

పిడుగు పాటుకో యాప్..

- పిడుగు రాకపై ముందే సూచన
- దామిని యాప్‌తో సత్ఫలితాలు



దామిని యాప్

స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో ప్రతీరోజు ఎక్కడో ఒక చోట వానలు పడుతున్నాయి. వాన పడిన సమయంలో మెరుపులు, పిడుగులు పడుతూనే ఉన్నాయి. భారీ వర్షాలు కురిసే సమయంలో మెరుపులు వాటితో పాటే పిడుగులు పడడం సహజం. ఐతే పిడుగులు పడిన ప్రతీసారి ఎక్క డో అక్కడ ప్రాణ, ఆస్తి నష్టాలు జరగడం అంతే సహజం అయిపో యింది. పిడుగు పడడం ముందే తెలిస్తే ఈ ప్రమాదాలనుఎంతో కొంత అరికట్టవచ్చు. ఇప్పుడు పిడుగు పడే కొద్ది నిమిషాల ముందు హెచ్చరించే యాప్ కూడావచ్చేసింది. ఆ వివరాలు మీ కోసం..

దామిని యాప్..

వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పాటుకు గురి కాకుండా ఉండేందుకు సాంకేతికత అందుబాటులోకి వచ్చేసింది. కేంద్ర ఎర్త్ సైన్సెస్ మినిస్ట్రీఈ డిపార్ట్‌మెంట్ దామిని లైట్నింగ్ అలెర్ట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఈ యాప్‌ను ఎవరైనా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. వాతావరణ సంబంధిత వివరాలతో పాటు మనం ఉంటున్న ప్రాంతంలో పిడుగు పడే 25 నిమిషాల ముందే సూచనను తెలుసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు భాషల్లో యాప్‌ను వినియోగించుకోవచ్చు. దీని కోసం లోకేషన్ వివరాలు తెలిపాల్సి ఉంటుంది.

పిడుగు పాటు నివారణకు జాగ్రత్తలు

యాప్ ద్వారా ఒక ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందని ముందే తెలిస్తే అక్కడ ఉన్న వారు వెంటనే పిడుగు పాటును తప్పించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కిందకు వెళ్లరాదు. నీరు ఉండే ప్రాంతానికి, విద్యుత్ పోల్స్ వద్దకు కూడ వెళ్లకూడదు. పెద్దగా ఉండే చెట్లు పిడుగులను ఆకట్టుకుంటాయి. అందుకే ఎట్టి పరిస్థితిలో చెట్టు కిందకు వెళ్లకుండా దగ్గరలో ఉన్న ఇంటిలోకి వెళ్లడానికి ప్రయత్నించాలి. సమీపంలో ఇల్లు లేకపోతే వెంటనే నేలపై పడుకోవాలి. విద్యుత్‌తో ప్రత్యక్ష సంబంధం ఉండే సెల్ ఫోన్, కంప్యూటర్‌లకు, బైక్‌లు, ట్రాక్టర్లకు దూరంగా ఉండాలి. ఎలక్ట్రానిక్ పరికరాల స్విచ్‌లు తొలగించి ఆఫ్ చేయాలి. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సింకులు, బాత్ టబ్‌ల వద్ద ఉండకూడదు. కాంక్రీట్ నేలపై, కాంక్రీట్ గోడలను ఆనుకుని పడుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వీటి ద్వారా మెరుపు ప్రయాణించే అవకాశాలు ఉంటాయి. ఉరుములతో కూడిన వర్షం ఉన్నప్పుడు స్నానం చేయరాదు. గిన్నెలు కడగవద్దని చెబుతున్నారు. ఇళ్లు, భవనాలపై పిడుగులు పడకుండా విద్యుత్ ఎర్తింగ్ సరిగా చేయించుకోవాలి.



పిడుగు పడి కాలిన విద్యుత్ వైర్లు(ఫైల్)

వ్యవసాయ మార్కెట్‌లో సాంకేతిక సమస్య

- సరుకుల కొనుగోళ్లలో జాప్యం
- ఇబ్బందులు పడిన రైతులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో సరుకుల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరిగింది. సరుకులకు తూకం వేసేటప్పుడు దడువాయిలు వినియోగించే పీవోఎస్ మిషన్లలో మారిన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన లేకపోవడం, సాఫ్ట్‌వేర్ సరిగ్గా పనిచేయకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెటింగ్‌శాఖ అధికారుల తీరు బాగాలేదని మండిపడ్డారు. ఈ విషయాన్ని దడువాయిలు వెంటనే ఇన్‌చార్జి కార్యదర్శికి తెలిపారు. అయితే నూతన సాఫ్ట్‌వేర్‌పై అధికారులకు, దడువాయిలకు అవగాహన లేకపోవడంతో ఆయన సైతం ఏమీ చేయలేకపోయారు. చివరకు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాము దడువాయిలకు చిట్టాబుక్ ఇచ్చి తూకం వేసిన వివరాలను అందులో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో రైతులు శాంతించారు. ఇక ముందు రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న వర్సిటీ ప్రొఫెసర్లు, మాదిగ నేతలు

ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ అందాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు దళితుల్లోని అన్ని వర్గాలకు అందాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సూచించారు. సోమవారం కేయూ గణితశాస్త్ర విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా, కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.సుజాతల నేతృత్వంలో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఘన సన్మానం చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ విద్య, ఉద్యోగాలతో పాటు అన్ని విభాగాల్లో అమలు జరిగేలా చూడాలన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలుస్తామన్నారు. 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాటంలో అనేక అవాంతరాలను ఎదుర్కొన్నామని చెప్పారు. ఉద్యోగాల్లో, ప్రమోషన్లలో ఎస్సీ వర్గీరణ జరుపాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉద్యోగులు జాతి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పీడిత వర్గాలవిముక్తికి పోరాటాలు చేస్తామన్నారు. భారీ గజామాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్, హాస్టల్స్ డైరెక్టర్ఎల్‌పీ రాజ్‌కుమార్, బీసీ నేత డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, డాక్టర్ సంకినేని వెంకన్న, డాక్టర్ మంద వీరాస్వామి, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దనయ్య, దిలీప్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ సిలివేరు రాజ్‌కుమార్, కుమ్మరి రాజయ్య, మంద రాజు, మంద శ్యామ్, బొక్క మొగిలి, బొచ్చు తిరుపతి, కుమ్మరి శ్రీనాథ్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ వంగాల సుధాకర్, వడ్డెపల్లి మోహన్,డాక్టర్ పుల్లా కుమార్, డాక్టర్ కుమారస్వామి, బొక్క దయాకర్, ప్రవీణ్ కుమార్‌తోపాటు విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాకాలలో త్వరలో సఫారి టూర్

- వన్యప్రాణుల మధ్య 2 గంటల ప్రయాణం
- పర్యాటకులకు పూర్తిస్థాయిలో కనువిందు

ఖానాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సహజ సిద్ధ అందాలకు నిలయమైన పాకాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పాకాలకు విచ్చేసే పర్యాటకుల సౌకర్యార్థం ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టింది. పాకాలకు ప్రధానంగా యువ పర్యాటకులను అధికంగా విచ్చేస్తుంటారు. పాకాలకు విచ్చేసే యువ పర్యాటకుల్లో జోష్ నింపేందుకు త్వరలో సఫారి టూర్ అందుబాటులోకి రానుంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.28లక్షలతో సఫారి టూర్ రూపుదిద్దుకుంటున్నది. ఇప్పటికే సఫారి టూర్ కోసం రెండు వాహనాల కొనుగోలు పూర్తయింది. ఆధునీకీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అదేవిధంగా వర్షాలు తగ్గుముఖం పట్టగానే సఫారి ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

దట్టమైన అడివిలో 10 కిలోమీటర్లు

పాకాల దట్టమైన అడవి ప్రాంతంలో 10 కిలోమీటర్లు సఫారి టూర్ ఉండేవిధంగా అటవీ అధికారులు రోడ్ మ్యాప్‌ను సిద్ధంచేస్తున్నారు. చిలుకమ్మనగర్ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి సఫారి వాహనంలో (7 గురికి పరిమితం) లోపలికి వెళ్లి అడవినంతా చుట్టేస్తూ మధ్యలో దుప్పులు, కొండగొర్రెలు, కణుజులు, కృష్ణ జింకలు, అడవి పందులు, నెమళ్లు, నక్కలు, తోడేళ్లు, అడవి పిల్లులతో పాటు వివిధ రకాల పక్షులను చూస్తూ టూర్‌ను కొనసాగించడం జరుగుతుంది. అదేవిధంగా అడవిలోపల, అటవీ జంతువులను, పక్షులను చూసే విధంగా అక్కడక్కడ వ్యూ లైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు అడవి మధ్యలో వాచ్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులు టవర్ ఎక్కి అడవిని పూర్తిగా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అడవి మధ్యలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన నీటి కుంటలలోని తాబేళ్లతో పర్యాటకులు సేద తీరేవిధంగా అటవీ అధికారులు సఫారి టూర్‌ను తీర్చిదిద్దుతున్నారు. రా కింగ్ మౌంటెన్ వద్ద సెల్ఫీ ఫొటోలు దిగేవిధంగా ఏర్పాటుచేస్తున్నారు. మొత్తంగా రెండు గంటల ప్రయాణం తరువాత పూర్తిస్థాయి సంతృప్తి చెందిన తరువాత సంగెం కాలువ సమీపంలో సఫారి టూర్ ముగియనుంది.





పాకాలలో సఫారి టూర్‌కు సిద్ధమయ్యే వాహనం (మోడల్), సఫారి టూర్ వెళ్లే మార్గంలో రాళ్లపై అటవీ జంతువుల బొమ్మలు

పాకాల పర్యాటకంపై ప్రత్యేక దృష్టి



పాకాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే లక్షల రూపాయల నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టాం. ఇటీవల బోటింగ్ పాయింట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, చిన్నపిల్లలకు ప్లేయింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకువచ్చాం. బటర్‌ఫ్లై గార్డెన్ ఆధునీకీకరణ చేపట్టాం. బ్యాటరీ వాహనం కొనుగోలు చేశాం. కట్ట పొడవునా సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. వర్షాలు తగ్గగానే సఫారి టూర్‌ను ప్రారంభిస్తాం. సఫారిటూర్‌తో పర్యాటకుల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంది.

\- రవికిరణ్, నర్సంపేట ఎఫ్ఆర్వో

ఒక రోజు పర్యాటకానికి అడుగులు

పాకాలకు విచ్చేసే పర్యాటకులు పూర్తిగా ఒక రోజు గడిపే విధంగా అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. పాకాలలో బోటింగ్ చేయడంతో పాటు, ట్రెక్కింగ్, సఫారి టూర్, నైట్ క్యాంపెనింగ్ కలిపి ఒక రోజు పూర్తిగా పాకాలలో గడిపే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నిధుల వెసులు బాటును బట్టి పనులను చేపడుతున్నామని అటవీ అధికారులు తెలుపుతున్నారు. నవంబర్ నెలలో సఫారి టూర్‌ను ప్రారంభించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. సఫారి టూర్ అందుబాటులోకి వస్తే పర్యాటకులకు మంచి కనువిందు కానుంది.

కేయూ 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపికబురు..

- ప్రమోషన్లు ఇచ్చేందుకు పాలకమండలి ఆమోదం
- కాంట్రాక్టు అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయస్సు పెంపు
- పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలకు పచ్చజెండా
- వర్సిటీ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఒకే..

కేయూ క్యాంపస్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తీపికబురు వచ్చింది. కోర్టు కేసుల నేపథ్యంలో సుదీర్ఘకాలంగా ప్రమోషన్లకు నోచుకోలేకపోయిన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కేరీర్ అడ్వాన్స్ స్కీం (క్యాష్) ప్రమోషన్లు ఇచ్చేందుకు వర్సిటీ పాలక మండలి ఆమోదం తెలిపింది. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్‌లో కేయూ పాలక మండలి సమావేశం జరిగింది. కేయూ వీసీ, పాలక మండలి చైర్మన్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవాసేన, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, బొద్దిరెడ్డి రమాదేవి, సుకుమారి, మల్లం నవీన్, బాలు చౌహాన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డిలు హాజరైయ్యారు.ఈ సందర్భంగా 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు,కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రమోషన్ల కల్పించాలని నిర్ణయించారు. అలాగే వర్సిటీ చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.20లక్షలను కేటాయించారు. వర్సిటీ పరిధిలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాల కోసం వర్సిటీ పాలక మండలి పచ్చజెండా ఊపింది. వర్సిటీ నియామ నిబంధనల మేరకు అధ్యాపకుల అవసరాల రీత్యా 130 మందిని వివిధ విభాగాల్లో పార్టుటైమ్ టీచింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించారు. కాంట్రాక్టు అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచిన ఉత్తర్వులకు ఆమోదం తెలిపింది. ఉద్యోగులు మరణిస్తే వారి అంత్యక్రియలకు రూ.20వేల నుంచి రూ.30 వేలకు పెంచారు. భూ కబ్జాల వివాదంతో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్‌కు గురైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబును మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. అయితే అశోక్ బాబును విధుల్లోకి తీసుకుంటూనే డిమోషన్ చేస్తారనే ప్రచారం వర్సిటీలో కొనసాగుతోంది. అశోక్‌బాబుతో పాటు భూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అందరికీ ఉద్యోగాలు మళ్ళీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే వర్సిటీ క్యాంపస్‌లో అశోక్‌బాబును విధుల్లోకి తీసుకోకుండా అనుబంధ కళాశాలల్లో పనిచేసే విధంగా సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

కొత్త పీహెచ్‌డీ అడ్మిషన్లపై సస్పెన్స్..

సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో కేయూలో వివిధ విభాగాల్లో నూతనంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల నిర్ణయం తీసుకుంటారని భావించినప్పటికీ ఏ నిర్ణయం తీసుకోకుండా సస్పెన్స్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. పీహెచ్‌డీ అడ్మిషన్లపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమించిన కమిటీ తుది నివేదిక అందచేయకపోవడంతో పాలక మండలి అడ్మిషన్ల విషయాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి, ఇతర సిబ్బంది,రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నేతృత్వంలో రూసా అభివృద్ధిపనులపైనా ప్రత్యేకంగా సమావేశం జరిగింది. వర్సిటీ ఉన్నతాధికారులు, డీఆర్‌లు, ఏఆర్‌లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తొర్రూరులో మాట్లాడుతున్న సత్యనారాయణ

పాలకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ కార్యకర్తలను కోరారు. సోమవారం మండలంలోని తొర్రూరులో ఆ పార్టీ ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై సత్యనారాయణ మాట్లాడారు. నిలువ నీడలేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేసి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పదేళ్ల కాలంలో ఒక్కరికి కూడా రేషన్‌కార్డులు ఇవ్వలేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు,గంగు కృష్ణమూర్తి, వీరమనేని యాకాంతరావు, మాజీ వైస్ ఎంపీపీ చిలువేరు కృష్ణమూర్తి, మార్కెట్ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, చిలువేరు బాలరాజ్, గోనె కార్తీక్, పసులాది యాకస్వామి, బిక్షపతి, ప్రభాకర్, సంపత్ జల్లం కుమార్ ఉన్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు



ముత్తారంలో మాట్లాడుతున్న నవీన్

పాలకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. సోమవారం ముత్తారంలో ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం జరగ్గా ముఖ్యఅతిథిగా నవీన్ మాట్లాడారు. ఎంపీటీసీ, సర్పంచు అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాచెర్ల ఎల్లయ్య, చింతకింది ఉపేందర్, మురళీధర్‌రావు, భారత హేమలత, గ్యార ఎల్లయ్య, పొడిశెట్టి సురేష్, గాదిరి సోమేశ్వర్ ఉన్నారు.

రైతుల మేలు కోరే పార్టీ కాంగ్రెస్సే



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివరాజ్ యాదవ్

జనగామ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల మేలు కోరే పార్టీ కాంగ్రెస్ అని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. మార్కెట్ ఏకేపీ కేంద్రాలను ప్రారంభించాలని శివరాజ్ యాదవ్ సోమవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ ఐకేపీ కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ మార్కెట్ కార్యదర్శి జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ అవార్డుల అందజేత



విద్యార్థులకు అవార్డులను అందజేస్తున్న ప్రిన్సిపాల్

లింగాలఘణపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడల్‌స్కూల్‌కు చెందిన 2025లో టెన్త్ క్లాస్ పూర్తి చేసి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు సోమవారం మోడల్ స్కూల్‌లో అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. అవార్డులను అందుకున్న వారిలో సాయివరుణ్, సందీప్, శివ, రిషజిత, కుసుమాంజలి, భవాని, పూజ, సంధ్యన ఉన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులను ప్రోత్సహిస్తున్న అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ ప్రతినిధులు దేవనూరి ఆనంద్, జమ్ముల వీరారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఇన్నోవేటివ్ టీచర్‌కు సన్మానం



ఉపాధ్యాయుడు గణేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రఘునాథపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వెల్ది మోడల్ స్కూల్‌లో ఇంగ్లీష ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కందగట్ల గణేష్‌ను హైదరాబాద్ జటాదర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ వారు స్టేట్ ఉత్తమ ఇన్నోవేటివ్ టీచర్‌గా ఎంపిక చేశారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో శుక్రవారం అవార్డును అందజేశారు. ఈమేరకు మోడల్ గణేష్‌ను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ గడ్డం జయశ్రీ, ఉపాధ్యాయులు మల్లం శ్రీధర్, గాజర్ల రుద్రమదేవి, పాలకుర్తి వినీల, సౌజన్యప్రియ, కట్టా రాజు, పార్వతి, సహనాసుల్తానా, విజయ, మోహన్‌రావు, శశికుమారి, కాసం మాలతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందిస్తున్న రోటరీ క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఛాగల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ హన్మకొండ ప్రతినిధులు 165 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను సోమవారం అందించారు. క్లబ్ సహకారం అభినందనీయమని విద్యాశాఖ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కొమురయ్య, క్లబ్ సెక్రటరీలు ఇలమురుగు, శివకామి, ఎన్ఆర్ఐ శ్రేయ-అభిరామ్, హెచ్ఎం సంపత్, డాక్టర్ తిరుపతి, అంజిరెడ్డి, రంజిత్‌కుమార్, రాజేంద్రప్రసాద్, పరమేశ్వరీ, శ్రీనివాస్, ప్రకాశం, విజయకుమారి, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో తాగి పడేసిన మద్యం సీసాలు



ప్రహరీ లేక పరేషాన్

● మందుబాబులకు అడ్డాగా కళాశాల ● ఆవరణలో పశువులు, విషపురుగుల సంచారం



నర్మెట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో లక్షలు వెచ్చించి కళాశాలలు పాలకుల నిర్లక్ష్యంతో ఆలనాపాలనా కరువైంది. చాలావరకు కళాశాలలకు ప్రహరీలు లేక ఆవరణలో పశువులు, విషపరుగులు సంచరిస్తున్నాయి. అంతేకాదు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. నర్మెట మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలకు ప్రహరీ లేక పోవడంతో మద్యం ప్రియులకు అడ్డాగా మరింది. దసరా పండుగ వేళ ఆవరణలో ఎక్కడపడితే అక్కడే మద్యంసేవించారు. దీంతో ఎటు చేసినా మద్యం సీసాలు, గ్లాసు కనిపిస్తున్నాయి. నర్మెట మండలకేంద్రంలో 2001లో జూనియర్ కళాశాల మంజూరైంది. కళాశాల ఏర్పాటై 24 ఏళ్లు అయిన కనీస సదుపాయాలు లేవు. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, తదితర గ్రూపులలలో రెండు సంవత్సరాలకు కలిపి 153 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలలో విద్యార్థులకు తాగునీటి వసతి లేకుండా పోయింది. గతంలో ఆర్‌వో వాటర్‌ప్లాంటు కళాశాలలో ఉన్న అది చెడిపోవడంతో దానిని ఎవరు పట్టించుకోవడం లేదు. బయటి నుంచి వాటర్ క్యాన్‌లలో తెచ్చి విద్యార్థులకు తాగునీటిని అందిస్తున్నారు.

కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

జి. మల్లేష్ కళాశాల ప్రిన్సిపాల్



కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మందుబాబులకు అడ్డాగా మారుతుంది. కళాశాల ఆవరణ అపరిశుభ్ర వాతావరణంగా ఉంటుంది. పశువులు, మేకలు, విషపురుగులు సంచరిస్తున్నాయి. హరితహారం మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. కాంపౌండ్ నిర్మిస్తే కళాశాలకు రక్షణగా ఉంటుంది.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న సౌడ రమేశ్

బచ్చన్నపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నిక ల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బంగారు మహేశ్ అధ్యక్షతన సోమవారం మండల స్థాయి సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా రమేశ్ హాజరై మాట్లాటారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ప్రతి గ్రామంలో బరిలో ఉంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పత్తా చాటాలన్నారు. సమావేశంలో నాయకులు బేజాడి బీరప్ప, శశిధర్‌రెడ్డి, తోకల ఉమారాణి, సద్ది సోమిరెడ్డి, సంపత్ పాల్గొన్నారు.



బీజేపీలో చేరికలు

తరిగొప్పుల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలకు ఆర్షితులయ్యే ప్రజలు బీజేపీలోకి చేరుతున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బొత్తలపర్రె గ్రా మంలో ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి యువకులు పెద్ద సం ఖ్యలో బీజేపీలో చేరారు. శ్రీనివాస్ మాట్లాడు తూ స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో కాషాయ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ము డావత్ రాజ్‌కుమార్, మాలతు రాజు, ముడావర్ వెంకన్న, ముడికె వీరస్వామి, భూక్య రాజు, వీనన్న, మౌర్య సంపత్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

దేవరుప్పుల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి అన్నారు. సోమవారం సింగరాజుపల్లిలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ బాకీ పడిన బాకీ కార్డులను ప్రతీ ఇంటికీ తీసుకెళ్లి ప్రచారం చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.



బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

నర్మెట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో సోమవారం ఎన్నికల్లో పోటీచేసే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, నర్మెట పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్దన్, మాజీ జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ కో ఆప్షన్ ఎమ్డీ గౌస్, మాజీ మండల అధ్యక్షుడు నీరటి సుధాకర్, గ్రామ అధ్యక్షుడు నక్కల రవి, నాయకులు కంతి రాజలింగం, ప్రజ్ఞాపురం అంజయ్య, కనకయ్య, రమేష్ పాల్గొన్నారు.

హామీల అమలులో పూర్తిగా విఫలం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జనగామ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు సోమవారం జనగామ వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తానని, రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.7వేలు అందజేస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక పూర్తి స్థాయిలో పథకాలను అమలు చేయాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బొల్లం శారద, బైరగోని యాదగిరి గౌడ్, నీల యాదగిరి ముదిరాజ్, నాగరాజు, ఇట్టబోయిన అశోక్ ముదిరాజ్ పాల్గొన్నారు.

గిరిజన రైతు ఆత్మహత్య



భాస్కర్(ఫైల్)

కేసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో గుగులోత్ భాస్కర్(40) అనే గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేసముద్రం మండలం నారాయణపురం శివారు పీక్లాతండాలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కె.క్రాంతికిరణ్ తెలిపిన ప్రకారం... వ్యవసాయం చేసుకుని జీవించే భాస్కర్‌కు తండాలో మూడెకరాల భూమి ఉంది. భార్య సరిత గృహిణి కాగా, పెద్దకుమారుడు అజయ్ నాగాలాండ్ ఎన్ఐటీలో బీటెక్, చిన్నకుమారుడు చరణ్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. పిల్లల చదువులకు, కుటుంబ అవసరాల కోసం కొద్దిరోజులుగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున కొట్టంలో చీరతో ఉరివేసుకున్నాడు.

యువత మత్తుకు బానిస కావొద్దు



జాగృతి కళాకారుల చైతన్య ప్రదర్శన

జఫర్‌గడ్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : యువత మత్తుకు బానిసలు కావద్దని పోలీసు జాగృతి బృందం కళాకారులు చైతన్య ప్రదర్శనలు నిర్వహించారు. తమ్మడపల్లి(ఐ)లో ఆదివారం రాత్రి వివిధ అంశాలపై సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా యువత గంజాయి, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరేని మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా 8712584473 అనే మొబైల్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటనారాయణ, కళాబృందం ఇన్‌చార్జి ఎఎస్ఐ నాగమణి, సభ్యులు విలియం, రత్నయ్య, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రంరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

బోనస్‌ను రైతుల ఖతాల్లో జమచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

జఫర్‌గడ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతుల వద్ద కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యానికి బోనస్ డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జఫర్‌గడ్‌లో జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాసంగిలో క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి జిల్లాలో 5,715 మంది రైతుల నుంచి సుమారు 2,54,716 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిందన్నారు. అయితే ఇప్పటి వరకు బోనస్ డబ్బులను చెల్లించకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందన్నారు. వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.12 కోట్ల బోనస్ నిధులను తక్షణమే జమ చేయాలని, లేనిచో రైతులచే ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం మండల నాయకులు నల్లతీగల శ్రీను, సముద్రాల దుర్గయ్య, ఎండి.ఖాదర్, నర్సింగం పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు

(3వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు కమీషన్ విడుదలను ప్రస్తావించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విడుదల చేయించాలని కోరారు. అలాగే అపరిష్కృతంగా ఉన్నతమ డిమాండ్లను పరిష్కరించాలని విన్నవించారు. ఇప్పటికీ కమీషన్ డబ్బులు రాకపోవడంతో మరోసారి ముఖ్యమంత్రిని కలువాలని డీలర్లు భావిస్తున్నారు. తమ పరిస్థితిని వివరించి కేంద్రంపై మరింత ఒత్తిడి తెచ్చేలా చూడాలని ముఖ్యమంత్రిని వేడుకోనున్నట్లు డీలర్లు చెబుతున్నారు.

నిరవధిక బంద్ దిశగా డీలర్లు

దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని కేంద్రం కమీషన్ డబ్బులు విడుదల చేస్తుందని డీలర్లు ఆశించారు. అప్పటికే షాపుల నిరవధిక బంద్ పాటించాలనే నిర్ణయానికి వచ్చిన డీలర్లు పండుగ సమయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు సృష్టించరాదనే భావంతో వేచి చూశారు.

కానీ, అక్టోబరు కూడా రావడం ఆరు నెలలుగా బకాయిలు అందకపోవడంతో ఇక రేషన్ షాపుల నిరవధిక బంద్‌కు సిద్ధమవ్వడమే మార్గమనే నిర్ణయానికి డీలర్లు వస్తున్నారు.

పెన్షనర్లకు బెనిఫిట్స్ వెంటనే అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన వారికి వెంటనే అన్ని బెనిఫిట్స్ అందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ సాధన కమిటీ బాధ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి ఇనుగాల ఇంద్రసేనా రెడ్డి, జిల్లా కన్వీనర్ వి.కొంరెల్లి మాట్లాడారు. 2024లో పదవీ విరమణ చేసిన వారికి కూడా ఇంత వరకు పూర్తి స్థాయిలో బెనిఫిట్స్ అందించక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

బెనిఫిట్స్ ఎప్పుడు వస్తాయోనని కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నా ఫలితం మాత్రం లేదన్నారు. ఉద్యోగులకు నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పినా దానిలో ఇంత వరకు రిటైర్డ్ ఉద్యోగులకు అందింది ఏమీ లేదని ఆరోపించారు.



అధికారులతో సమీక్షిస్తున్న మాధవీలత

స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవీలత

చిలుపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత స్పష్టం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. మాట్లాడుతూ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని, సామగ్రి సైతం ఎమ్మార్సీ (మండల విద్యా వనరుల కేంద్రం) కార్యాలయానికి చేరిందన్నారు. తొలివిడతలో చేపట్టనున్న ఎన్నికలకు సంబంధించి 9 నుంచే అభ్యర్థులు నామినేషన్లు చేయవచ్చని, ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచుతామని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై సిరివురం నవీన్‌కుమార్, ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఈసీ సింగపురం కిరణ్ కుమార్, రాజేశ్వర్, నిఖిల్ పాల్గొన్నారు.

అవకాశం కల్పించాలి



జడ్పీటీసీ టికెట్‌కు స్వామి దరఖాస్తు

జనగామ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జడ్పీటీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే గెలుపొందాక అభివృద్ధి చేస్తానని బీజేపీ నాయకుడు ముక్కస్వామి అన్నారు. జనగామ మండల జడ్పీటీసీ అభ్యర్థిగా పార్టీ అవకాశం ఇవ్వాలని సోమవారం ముక్కస్వామి పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

గూడూరులో విషాదం



రాజేష్ (ఫైల్)

పాలకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గూడూరులో సోమవారం జరిగింది. ఎస్సై డి.పవన్‌కుమార్ కథనం ప్రకారం. గూడూరుకు చెందిన ఏదునూరి దేవేంద్ర, లింగయ్యల కుమారుడు రాజేష్ (27) రెండేళ్లుగా హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత ఏడాది క్రితం నర్మెటకు చెందిన రాధికతో వివాహం జరిగింది. కొద్ది నెలలుగా రాజేష్ మద్యానికి బానిసయ్యాడు. దసరా కోసం గ్రామానికి రాగా, ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బకాయిలను విడుదల చేయాలి

బత్తుల రమేశ్ బాబు, తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం తక్షణ మే రేషన్ డీలర్ల కమీషన్ బకాయిలను విడుదల చే యాలి. లేదంటే షాపులను నిరవధికంగా బంద్ చేస్తాం. సన్న బియ్యం సరప రా కావడంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదనే బంద్ విషయంలో ప్రస్తుతానికి వెనక్కు తగ్గాం. ఇదే పరిస్థితి కొనసాగితే తప్పక బం ద్ పాటిస్తాం. ఇందుకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడి మా సమస్య పరిష్కారించాలని విజ్ఞప్తి. కమీషన్ డబ్బులను రూ.300కు పెంచాలి.